# ప్రపంచం రెండుగా...

రావుడు తాత పొడవైన చేతి కర్రకు తగిల్చిన తాటాకుల గొడుగు బుర్ర మీద వేసుకుని మామిడి చెట్టు కిందకు చేరాడు. గొడుగు తీసి చెట్టు మొదల్ని పెట్టి, చేతి కర్రని ఆనుకుని, చెట్టు మొదలకు నడుం వాల్చి కూర్చున్నాడు. చెప్పులు విప్పి తడిసిపోకుండా చెట్టు తొర్రలో పెట్టాడు. సగం కాల్చిన చుట్ట ముక్కను తలపాగా లోంచి తీసి ముట్టించాడు.

వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. ఎర్రటి బురద నీరు ఉరకలు వేస్తూ వరదలా ఏరు పారుతోంది. ఏటికి రెండు వైపులా వెదురు పల్లకీలను పెట్టి బస్సులకోసం ఎదురుచూస్తూ కూలీలు కబుర్లు చెప్పుకుంటూ చెట్లకింద కూర్చున్నారు. బస్సులు రాగానే ప్రయాణికుల్ని వెదురు పల్లకీలలో మోసి ఏరు దాటించి ఒడ్డుకి చేరుస్తారు. నలభై ఏళ్లుగా రావుడు తాత ఆ పనిలో జీవితాన్ని గడిపాడు. అయిదేళ్లయింది. ఎడంకాలు కొద్దిగా పట్టుతప్పింది. ప్రవాహాన్ని చీల్చుకుంటూ, పల్లకీ మోయలేకపోయాడు. ఆ పని మానేశాడు. ఆ పని మానేసినా, ఏరు, ప్రవాహం, చెట్లు, ఏటి ఒడ్డులు, వెదురు పల్లకీలు, అవి మోస్తున్న తన ఊరి కూలీలు, ప్రయాణీకులు, జీవితంగా మిగిలిపోయారు. రోజూ వస్తూ ఆ చెట్టుకింద కూర్చుని కొంతసేపు గడుపుతున్నాడు.

రావుడు తాత గతజీవితాన్ని నెమరువేసుకుంటూ, చుట్ట కాల్చుకుంటూ చుట్టూ చూస్తున్నాడు.

అంతలో అప్పలకొండ వచ్చి, అతడికి ఎదురుగా మోకాళ్ల మీద కూర్చున్నాడు. అతడి కళ్లల్లో మంటలు కనిపిస్తున్నాయి. 'ఏటి సెప్పను, తాతా! ఏటి సెప్పను! పనసపండు నాంటి నా కొడుకు సచ్చిపోయేడు. ఇసం జొరం పట్టేసింది. పిల్లోణ్ణి అగ్గిలా కాల్చేసింది. కుర్రాణ్ని తీసుకుని పట్నం ఎల్లేను. ఒయిద్దుడి కాడి కెల్లాను. ఏభై తెచ్చినావా? అని అడిగేడు. నేదు. పదే ఉందన్నాను. పదిరూపాయల ఒయిద్దుడి కాడికెల్లు అని కూకలేసి తవిలేశాడు. ముగ్గురి కాడికెల్లినా, ముగ్గురూ అలాగే తవిలేశారు. రిచ్చావోడు దరమానువత్తిరికి తీసుకెళ్లాడు. మడుసులు తోసుగుంటూ లైనల్లా నిలబడ్డారు. పిల్లోడు తల వాలిస్తండు. సొంగలు కక్కేస్తండు. ఎర్రిగా గావుకేకెట్టేను. ఒయిద్దుడు పిలిచి, పిల్లోణ్ని సూసి, సచ్చిపోనాడని సెప్పి, ఎల్లిపోయాడు. సరిగ్గా ఓరం అయ్యింది. కునుకు పట్టడంనేదు! నా

కొడుకు పేనం ఒయిద్దుడికి ఏభై రూపాయలన్నమాట! బుఱ్ఱ దిమ్మెక్కిపోయింది. సెడిపోయింది. కునుకురానేదు!" అప్పలకొండ తల బాదుకుంటూ చెప్పాడు.

'చూడు అప్పిగా! సావు... పుటక ... మడిసి చేతిలో నేవు. ఋణానుబంధం తీరిపోయింది. పసితనంలోనే దేవుళ్లో కలిసిపోనాడు. ఇసారించి నాభంలేదు. మనసు రాయి సేసుకు బతకాల! నీకు అప్పు తీర్చేసి ఎల్లిపోనాడు. అలగనుకుని గుండె దిటవ సేసుకో' అని రావుడు అతణ్ని ఓదార్చాడు.

అంతలో ఒకామె పరుగు పరుగున వచ్చి రావుడి తాత మొహంలోకి చూస్తూ నిలబడింది. వయసు ఎక్కువ లేకపోయినా, చిక్కిపోయి నిరాశలా చీకటిలా కనబడుతోంది. ఆమె చేతుల్లో చంటి పిల్లాడున్నాడు.

"పిల్లోడికి జొరంగుంది. పట్నం ఎల్లాలి. అవితిలి ఒడ్డుకి దిగబెట్టవా! నీకు పున్నెముంటుంది!"

"రెండు రూపాయలవుద్ది!" అప్పలకొండ చెప్పాడు

"నాకాడంత డబ్బు నేదు."

"ఇంటి కెల్లిపో! డబ్బు నేందే ఒయిద్దుడు సూడ్డు!"

ఆమె చింకి చీర సర్దుకుని, మోకాళ్ల మీద కూర్చుంది. పిల్లాణ్ని పొందిగ్గా ఒళ్లో కూర్చోబెట్టుకుంది. చీర కొంగు ముడి విప్పి, పన్నెండు రూపాయలు తీసి చూపించింది.

'ఒయిద్దుడికి పది, రెండు బస్సుకి, తిరిగొచ్చేటప్పుడు నడిచేసి వొచ్చేస్తా!'

'మాకు రెండియ్యి. ఒయిద్దుడికి పదియ్యి, బస్సోణ్ని పున్నె ముంటాదని సెప్పి ఒత్తినే తీసుకెళ్లమను!"

"ఆళ్లు ఒప్పుకోరు. బస్సెక్కనీరు!"

"మాకు రెండియ్యి. బస్సోడికి రెండియ్యి! ఒయిద్దుడికి ఎనిమిదియ్యి!"

"ఒయిద్దుడు ఒప్పుగోడు. మందులు అరువు తీసుకుంటా!"

"ఒయిద్దుడు ఒప్పుగోడు. బస్సోడు ఒప్పుగోడు! మా వెందు కొప్పుకోవాల? మాం తీసుకెళ్లం."

"పిల్లోడి ఒళ్లు ఎలా కాలిపోతందో నువు సూడు! ఆలిస్సెం అయిపోతే, ఏటవుద్దో బయ్యంగుంది!" అని చెప్పి, పిల్లాణ్ని అప్పలకొండ చేతుల దగ్గరకు అందించింది.

"రెండు ఇస్తేనే మాం దిగబెడతాం!" అప్పలకొండ తల అడ్డుగా తిప్పుతూ. మొహం పక్కకు తిప్పుకుని, కొద్దిగా దూరంగా జరిగిపోయాడు.

ఆమె పిల్లణ్ని గుండెలకి దగ్గరగా హత్తుకుని పట్టుకుంది. చిరిగిపోయిన చీర కొంగుని ఒత్తుగా కప్పింది. చేతులు కదుపుతూ లాలిస్తోంది. ఆమె కళ్లల్లో నీళ్లు కదులుతున్నాయి. రావుడు తాత మొహంలోకి దీనంగా చూస్తోంది.

"నీకాళ్లట్టుగుంటా! సాయం సెయ్యవా?" అని ఆమె కుడిచెయ్యి అతడి కాళ్ల దగ్గరికి సాచింది.

అతడు దూరంగా జరిగిపోయి తల వంచుకుని భూమిలోకి చూస్తూ కూర్చున్నాడు.

రావుడు తాత ఆ మాటలు విన్నాడు. అదంతా చూశాడు. మరింక మౌనంగా ఉండలేకపోయాడు.

'ఓరప్పిగా! ఆళ్లు - ఒయిద్దులు తప్పు సేస్తన్నారు. మనవూ వలగే తప్పు సెయ్యాలట్రా?"

"ఆళ్లు పెద్దోళ్లు! గొప్పోళ్లు! సదువుకున్నోళ్లు! అన్నీ ఉన్నోళ్లు! దేనికీ ఆళ్లకి నోటు నేదు! ఆళ్లే అలగ సేస్తా ఉంటే, నానెందుకు సెయ్యగూడదు! మనవెందుకు సెయ్యగూడదు!"

"ఆళ్లకి డబ్బేగానీ, మడిసక్కర్నేదు. మనకీ అంతేనట్రా?"

"ఆళ్లకి గావలసిందే మనకీ గావాల! ఆళ్లకి అక్కర్నేంది మనకీ ఒద్దు!"

"అప్పిగోడు మంచి కుర్రోడు. సాయం ఒవులడిగినా కాదనే మనిషి కాడు. ఎప్పుడూ కాదనలేదు. ఇయ్యాల ఆడికి మనసు సెడిపోయింది. ఆణ్ని మరింత కూకలేసి లాబంనేదు!' రావుడు తాత ఆమెతో చెప్పాడు. తక్కిన కూలీలు కూడా ఆ మాటలు విన్నారు. ఎవరూ నోరిప్పలేదు. అప్పలకొండ ఎవరికైనా అడగకుండానే

సాయం చేసే మనిషి. అతడు కాదన్నాక ఎవరూ ముందుకు రాలేదు. రావుడు తాత అది గ్రహించి మరింక ఎవరికీ ఏమీ చెప్పలేదు.

ఏటికి రెండు వైపులా బస్సులు వచ్చేశాయి. ప్రయాణికులు బస్సులు దిగి పరుగు పరుగున ఏటి ఒడ్డుకి చేరుకుంటున్నారు. కూలీలు వెదురు పల్లకీల దగ్గర జట్టులు జట్టులుగా నిలబడ్డారు. ఆమె దీనంగా, దిగులాగా పిల్లాణ్ని గుండెలకు అదిమి పట్టుకుని కదలిక లేకుండా నిలబడిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్లు ఎండిపోయాయి. రావుడు తాత బిగువుగా గోచీ బిగించాడు. తుండు గుడ్డ గట్టిగా మొల చుట్టూ చుట్టుకున్నాడు. తలపాగా చుట్టు చుట్టి బిగించాడు. చుట్ట ముక్క తలపాగా మడతలో పెట్టాడు. చేతికర్రను అందుకుని, 'రా బుల్లెమ్మా, రా! నాను తీసుకెళ్తా!' అని అతడు, ఎడం కాలు మెక్కుతూ మండుతున్న మంటలా పల్లకీ దగ్గరికి వెళ్లాడు. ఆమెను పల్లకీలో కూర్చోబెట్టాడు. మనవణ్ని పిలిచి ముందువైపు పట్టుకోమని, తను వెనకవైపు పట్టుకున్నాడు.

"ఆగు. తాతా! ఆగు!" అని అప్పలకొండ గావుకేక వేసి పరుగు పరుగున వచ్చి, "నానుండగ నిన్ను ఏటిలో దిగనిస్తానేటి?" అని రావుడు తాతని ఒడ్డుకు పంపించి, ఆమెను అవతలి ఒడ్డుకు చేర్చాడు. ఆమె వడివడిగా పరుగెత్తి బస్సు ఎక్కి పిల్లాణ్ని ఒళ్లో పడుకోబెట్టి చీర కొంగు ఒత్తుగా కప్పి, రావుడు తాతకి దండాలు గుండెల్లో అర్పిస్తోంది.

★ ★ ★

ఆకాశం చిల్లులు పడిపోయినట్లు ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. ఏరు వరదలా పారుతోంది. ఏటికి రెండు వైపులా రెండు కార్లు వచ్చి ఆగాయి. కారులో ఓ వ్యక్తి దిగి పరుగుపరుగున పల్లకీ దగ్గరికి వచ్చాడు.

"మా తండ్రిగారికి ఆరోగ్యం బాగా లేదు. ప్రమాద పరిస్థితిలో ఉన్నారు. వేగంగా అవతలి ఒడ్డుకు చేర్చండి. అర్జెంట్! అర్జెంట్!" అన్నాడతను.

అప్పలకొండ మౌనంగా ఉండిపోయాడు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. 'ఆడే ఈడు' అని అప్పలకొండ మనసులో అనుకున్నాడు.

"అర్జెంటు! అర్జెంటు! రేటు ఎంతో చెప్పు. ఇచ్చేస్తాను."

"వెయ్యి."

"వెయ్యా."

"అవును."

"అందరి దగ్గరా అలాగే తీసుకుంటున్నారా?"

"లేదు. అందరి దగ్గిరా రెండు రూపాయలు మాత్రమే తీసుకుంటాం."

"నన్ను వెయ్యి ఎందుకు అడుగుతున్నావు?"

"నీ కిష్టముంటే వెయ్యి ఇచ్చి, పల్లకీలో గూకో. నేకపోతే, తిన్నగా ఎల్లిపో! మరేమీ మాట్లాడకు."

"నా అవసరాన్ని డబ్బు చేసుకుంటున్నావన్న మాట."

"అవును."

అతడికి వెయ్యి రూపాయలూ ఇచ్చి పల్లకీలో కూర్చున్నాడు. ఏటి ప్రవాహాన్ని చీల్చుకుంటూ వడివడిగా అతణ్ని అవతలి ఒడ్డుకి చేర్చాడు అప్పలకొండ.

"వెయ్యి రూపాయలు! వెయ్య రూపాయలు! నా అవసరాన్ని డబ్బు చేసుకున్నావన్నమాట!" – అతడు కోపంగా అప్పలకొండ మొహంలోకి చూస్తూ పళ్లు పటపటా కొరుక్కున్నాడు.

'నీ ఏప్లై రూపాయల రేటుకీ – నా వెయ్యిరూపాయల రేటుకీ ఏటి తేడా?' అని అప్పలకొండ వెయ్యి రూపాయలూ అతడి మొహం మీద విసిరికొట్టి, రెండు రూపాయలు కూడా తీసుకోకుండా వెళ్ళిపోయాడు.

నిజమైన శ్రమకు శ్రమ జీవనానికీ నిజమైన విలువ, గౌరవం, లేకుండా చేయడంలోంచే దోపిడీ వ్యవస్థ వచ్చింది. దానివల్ల ప్రపంచం రెండుగా నడుస్తోంది!

★ ★ ★

(1. ఆంధ్రప్రభ – వారపత్రిక – 20.10.1997)

(2. హిందీలోకి అనువాదం: విపాశా – త్రై మాసిక పత్రిక – 2001 – డా॥ఎస్. పద్మావతి)